క్లుప్తంగా

మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సిబ్బంది

తొగుట(దుబ్బాక): ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా మొక్కలను నాటి పరావరణాన్ని సంరక్షించాలని మిరుదొడ్డి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గాయిత్రి కోరారు. వనమహోత్సవం–2025లో భాగంగా మండల పరిధిలోని కాన్గల్‌లో ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఆదివారం వెయ్యి ఈత మొక్కలను నాటారు. ఆ సదర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరాణాన్ని రక్షించాలంటే విధిగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ జహూరుద్దీన్, సిబ్బంది షాబొద్దీన్, ముజిబుద్దీన్, మౌనిక, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసినా.. పనులు ప్రారంభించరా?



శిలాఫలకాన్ని చూపిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మహ్మదాపూర్‌కు తారురోడ్డు నిర్మాణానికి 17 నెలల కిందట మంత్రి పొన్నం ప్రభాకర్ శంకు స్థాపన చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదని బీఆర్‌ఎస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన గుంతల రోడ్డును పరిశీలించారు. మడద రోడ్డు నుంచి మహ్మదాపూర్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు చేయడానికి యేళ్లు పడితే శంకుస్థాపనలు ఎందుకు చేయడమని ప్రశ్నించారు. హుస్నాబాద్‌కు మంత్రి పదవి వచ్చిన ప్రజలు ఆశించిన అభివృద్ధి పనులకు నిధులు రాలేకపోతున్నాయన్నారు. రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి మహ్మదాపూర్ ప్రజలకు రవాణా భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

స్ఫూర్తిదాయకం అబ్దుల్‌కలాం జీవితం



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని గజ్వేల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సైల్‌మ్యాన్‌గా పేరుగాంచిన అబ్దుల్‌కలాం శాస్త్ర సాంకేతికరంగాల్లో పెను మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అంకిత భావంతో దేశానికి సేవలు చేసిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్క రాములు, గుంటుకు శ్రీను, గాడిపల్లి శ్రీను, అజ్గర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్డు ధ్వంసం



ధ్వంసమైన బెజ్జంకి–రామసాగరం రోడ్డు

బెజ్జంకి(సిద్దిపేట): కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో బెజ్జంకి–రామసాగరం రోడ్డు పలు చోట్ల ధ్వంసమైంది. కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు ధ్వంసమవుతుందని గ్రామమస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంత రోడ్డుపై చాలా ఏళ్లు ప్రయాణించి అవస్థలు పడ్డాం, నూతనంగా రోడ్డు నిర్మించడంతో అనుకూలంగా ఉందుకుంటే ఇప్పుడు ఈ కేజ్‌వీల్స్‌తో మళ్లీ ధ్వంసమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు పక్కన పొదల తొలగింపు



పొదలు తొలగిస్తున్న జేసీబీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల–బెజ్జంకి క్రాసింగ్ రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పొదలు, పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో ఆదివారం తొలిగించారు. పొదల వల్ల వాహనదారులకు అసౌకర్యంగా మారిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లికి విన్నవించగా సత్వరమే పనులు చేసినందుకు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

రోడ్లు, ఇళ్ల మధ్యనే చెత్త కుప్పలు

- సిల్టుతో నిండిపోయిన డ్రైనేజీలు
- విజృంభిస్తున్న దోమలు
- కలుషితమవుతున్న తాగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అసలే వర్షాకాలం.. పరిసరాలను పట్టించుకోకపోతే వ్యాధులకు ఆజ్యం పోసే కాలం.. జనాలు వ్యాధుల భారీన పడే తరుణం. ప్రత్యేక పాలనాధికారులు పట్టించుకోకపోవడంతో పారిశుద్ధ్యం పడకేసింది.



ప్రధాన రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వీధులు కంపుకొడుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో సిల్టు తొలగించకపోవడంతో మురుగు రోడ్లపైనే పరుగులు పెడుతోంది. దీంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. చెత్త కుప్పలు, మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతున్నాయని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల బెంబేలు..

ఇళ్ల మధ్య పెరిగి పోతున్న పిచ్చి మొక్కలను తొలగించక పోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రాత్రిపూట కంటి మీద కునుకు లేకుండా పోయిందని స్థానికులు మండిపడుతున్నారు. అలాగే వృద్ధులు, చిన్నారులు రోగాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



ఇళ్ల మధ్యే చెత్త కుప్ప



డ్రైనేజీ నిండి పారుతున్న మురుగు

పైపులైను లీకేజీ..

స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ప్రధాన పైపులైను లీకవడంతో తాగునీరు కలుషితమవుతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటికి అధికారులు మంగళం పాడారని, బోరుబావి నీటిని ప్రధాన ఓవర్ హెడ్ ట్యాంకులోకి ఎక్కిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఆ పైపులైను రెండు చోట్ల పగిలిపోవడంతో నీరు వృథాగా పోవడమే కాకుండా నీరు కూడా కలుషితం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

దోమలతో వేగలేక పోతున్నాం



ఇళ్ల మధ్య చెత్త కుప్పలు పెరిగిపోవడం, మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. రాత్రయిందంటే చాలు దోమలతో నరకయాతన అనుభవిస్తున్నాం. రోగాల పాలై ఆస్పత్రుల్లో చేరాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు వెంటనే కల్పించుకుని కాలువలను శుభ్రం చేయించి, పెంట కుప్పలను తొలగించాలి.

– నిర్మల, మిరుదొడ్డి

ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి



వర్షాకాలంలో వ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు అధికారులు మిరుదొడ్డిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. గ్రామంలో చాలా వరకు పారిశుద్ధ్య నిర్వహణ లోపించింది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలి.

– భాస్కర్, సీఐటీయూ జిల్లా నేత

చర్యలు చేపడతాం



వర్షాకాలంలో వ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు చర్యలు చేపడతాం. గ్రామంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను, పిచ్చి మొక్కలను తొలగిస్తాం. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి తాగు నీటిని అందించే పైపు లైనుకు మరమ్మతులు చేపడతాం. పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలి.

– గంగుల గణేశ్‌రెడ్డి, ఎంపీడీఓ, మిరుదొడ్డి

భోజనశాలకు మోక్షం ఎప్పుడు?

అసంపూర్ణంగా నిర్మాణం

- పిల్లర్ల దశలోనే ఆగిన పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన డైనింగ్ హాల్

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి చేపట్టిన భోజనశాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు.

2023లో ప్రారంభం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మనఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా 2023లో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. దానికి రూ.35 లక్షల నిధులు కేటాయించారు. కానీ అది ఆదిలోనే నిలిచిపోయింది. పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు.

నిధులు వస్తేనే..

భోజనశాల నిర్మాణానికి సంబంధించి ఇంకా రూ.8 లక్షలు గ్రాంటు రావాలని, మిగిలిన గ్రాంటు రాగానే నిర్మాణాన్ని పూర్తి చేస్తానని కాంట్రర్ లింగం తెలిపాడు. విద్యుత్ కనెక్షన్, నీటి సరఫరా కోసం పైపు లైను, గ్రానైట్ రాతి పలకల ఏర్పాటు తదితర పనులు చేయాల్సి ఉందని ఆయన చెప్పారు. ఆరుబైట కూర్చొని తినాలంటే ఈ వానాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. డైనింగ్ హాల్ నిర్మాణానికి ఉన్నతాధికారులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని హెచ్‌ఎం బాసిత్ కోరారు.

ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు

విద్యార్థులకు డైనింగ్ హాల్ లేనందున భోజనం చేసేటప్పుడు తరగతి గదుల ఎదుట కూర్చొని తినాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది వర్షాకాలం కావడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

– ఎంఏ బాసిత్, హెచ్‌ఎం

సర్పంచ్‌ల బిల్లులు వెంటనే చెల్లించాలి

బీజేపీ రాష్ట్ర నేత రాంగోపాల్‌రెడ్డి



మూతబడిన పాఠశాలలో నివాసం ఉంటున్న లావణ్య కుటుంబంతో బీజేపీ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాలను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దిన మాజీ సర్పంచ్‌లు ప్రస్తుతం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారని, ఆ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి డిమండ్ చేశారు. అక్కన్నపేట మండలం మైసమ్మ వాగుతండా మాజీ సర్పంచ్ లావణ్య గ్రామ అభివృద్ధికి ఖర్చు చేసిన బిల్లులు రాక కనీసం ఇల్లు లేక మూతబడిన ప్రాథమిక పాఠశాలలో ఉంటున్న క్రమంలో ఆదివారం బీజేపీ, బీఎస్పీ నాయకులు వేర్వేరుగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీసం ఇళ్లులేని సర్పంచ్‌లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, నాయకులు సంపత్, నూనావత్ మోహన్, మడక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే..

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితను నిందితురాలుగా సీబీఐ అరెస్టు చేసిన తరువాత, ఆమెను జైలు నుంచి బయటకు తీసుకువచ్చేందుకు బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయాలనుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికైనా మేల్కోవాలని యద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అగ్ర నాయకులు వారి అవసరాల కోసం కార్యకర్తల రాజకీయ భవిష్యత్‌ను బీజేపీ దగ్గర తాకట్టు పెడతారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. పదేళ్లలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు చేసిందేమీ లేదని వాపోయారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా ముందుకు సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాజొద్దిన్, కిషన్, బాబా, నజ్జు, ఫయాజొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2015–16బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో వారంతా కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముగిసిన జిల్లా స్థాయి యోగా పోటీలు



పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సెంటర్లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించారు. 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసుల వారికి పోటీలు నిర్వహించారు. పురుషులు, మహిళలకు వేరువేరుగా పోటీలు నిర్వహించి, ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలలో రాణించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన వారు ఆగస్టు 7, 8తేదీలలో ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలకు సిద్దిపేట నుంచి ప్రాతినిథ్యం వహించనున్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తోట సతీశ్, సంధ్య, రాజ్‌కుమార్, సాయి తేజ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

మన్‌కి బాత్ వీక్షించిన ఎంపీ



బీజేపీ నాయకులతో కలిసి మన్‌కి బాత్ వీక్షిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కి బాత్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులతో కలిసి ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆదివారం వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, మట్ట మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్



మృతుడి కుటుంబాన్ని ఓదారుస్తున్న ఫారూఖ్

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు తాను నిరంతరం అందుబాటులో ఉండి ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ హామీ ఇచ్చారు. మండల పరిధిలోని అందె గ్రామంలో ఇటీవల మాదారం ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రూ.5 వేలు నగదుతోపాటు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి దొమ్మాట, నేటి దుబ్బాక నియోజకవర్గ ప్రజలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తాను ఎక్కడ ఉన్నా ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు చేయూత ఇస్తానన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకుడు సూకూరి లింగం, మాజీ ఎంపీటీసీ జక్కిరెడ్డి సోమేశ్వర్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ భవన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నాగభూషణం



విక్రమ్‌రెడ్డి

సిద్దిపేటజోన్: ఎన్జీఓ భవన్ పేరు ప్రఖ్యాతులను మరింత ఇనుమడించేలా పనిచేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన నాగభూషణం, విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్జీఓ భవన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా విక్రమ్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పోచయ్య, రాజేందర్; సహాయ కార్యదర్శులుగా రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రాజు, ఆర్థిక సంఘం సభ్యులుగా రామ్మోహన్, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా మధుసూదన్, చక్రధర్, సత్యనారాయణ, శ్రీనివాసులు, రాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు తమను ఎన్నుకున్న జీవిత కాల సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా సేవా కార్యక్రమాలను మరింత వ్యాప్తి చేస్తామన్నారు.



ఒక్కచోట చేరిన కుటుంబ సభ్యులు

ఒక్కటైన బలగం

మర్కూక్(గజ్వేల్): కుటుంబాలు వేరైనా రక్త సంబంధం వారిని ఒక్కటిగా చేసింది. యాదాద్రి జిల్లా రాజపేట మండల కేంద్రానికి చెందిన వల్లకొండ లక్ష్మీనారాయణ దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. వారి పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు, వారి పిల్లలు కలిసి సుమారు రెండు వందల మంది ఆదివారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఓ రిసార్ట్‌లో ఒకచోట చేరి ఆనందంగా గడిపారు. పిల్లలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పెద్దలు తమ అనుభూతులను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకిరించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా పాల్గొన్నారు.

దారులు దయనీయం



చిత్తడిగా గౌరారం బీసీ కాలనీ రోడ్డు

వీధులన్నీ బురదమయం

- ఇబ్బందుల్లో గౌరారం బీసీ కాలనీ వాసులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

వర్గల్(గజ్వేల్): చిరుజల్లులకే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ప్రధానరోడ్డు గోతులమయమైంది. వీధుల్లో నీరు నిలిచి అడుగేయాలంటేనే కష్టంగా మారింది. ఏళ్లు గడచినా పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ వ్యవస్థతో వర్గల్ మండలం గౌరారం బీసీ కాలనీలో ఈ దుస్థితి నెలకొంది.

భారీ గోతులతో బేజారు

రాజీవ్ రహదారి–మామిడ్యాల క్రాస్‌రోడ్డు పక్కనే బీసీ కాలనీ ఉంది. దశాబ్దాల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో గృహాల సంఖ్య పెరిగింది. అదేస్థాయిలో మురుగు నీటి వ్యవస్థ బాగుపడలేదు. మామిడ్యాల క్రాస్‌రోడ్డు నుంచి కాలనీవైపు వెళ్లే తారురోడ్డు వాహనాల తాకిడికి పూర్తిగా దెబ్బతింది. తారు మాయమై భారీ గోతులు ఏర్పడ్డాయి. మరోవైపు సరైన డ్రైనేజీ వసతి లేకపోవడంతో కాలనీలో అంతర్గత రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయంగా మారాయి. రాజీవ్ రహదారి పక్కనే విస్తరించిన ఈ కాలనీ కొద్దిపాటి వర్షం పడినా అస్తవ్యస్తంగా మారుతోంది. నీరు నిలిచి పోకుండా సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్స్ నిర్మిస్తేనే కాలనీ వాసుల కష్టాలు తీరే అవకాశముంది.



చెరువును తలపిస్తున్న బీసీ కాలనీ అంతర్గత రోడ్డు

ఇబ్బంది పడుతున్నం..



కాలనీలో మోరీలు సరిగా లేవు. జెర్రంత వాన పడినా కాలనీల నీళ్లు నిలిచిపోతున్నయ్. చాలా కాలం నుంచి బాధలు పడుతున్నం. సర్కారోల్లు జెర పట్టించుకోవాలె.

– యెల్లం, కాలనీవాసి

అడుగడుగునా గోతులే..



మామిడ్యాల రోడ్డు మీద అడుగడుగునా గోతులే ఉన్నాయి. వాన పడితే అందులో నీళ్లు నిలుస్తున్నయ్. రోడ్డు బురదగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు బాగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహేశ్, కాలనీవాసి